

స్వచ్ఛతే ఆశయం



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టరు వినోద్ కుమార్

■ కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, సెప్టెంబరు17: స్వచ్ఛతే అందరి ఆశయం కావాలని జిల్లా కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లావ్యాప్తంగా చేపట్టారు. జిల్లాకేంద్రంలో మున్సిపల్, కాలుష్య నియంత్రణ శాఖల ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. కలెక్టరు ముఖ్య అతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ వరుకు కొనసాగించారు. అక్కడ అధికారులు, ప్రజలు, విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. కలెక్టరు.. వారితో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాల అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ.. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని అక్టోబరు 2వ తేదీవరకు చేపడతామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి, ఆర్డీఓ వసంతబాబు, నగర పాలక కమిషనర్ మూర్తితో పాటు వివిధశాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సూర్యకుమార్ యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న హోటల్ సిబ్బంది

అనంతకు స్కై...

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17: అంతర్జాతీయ క్రికెట్‌లో వైవిధ్య షాట్లతో స్కైగా పేరొందిన భారత జట్టు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మంగళవారం నగరానికి చేరుకున్నారు. ఓ హోటల్‌లో దిగాడు. స్థానిక అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్ (ఏసీజీ)లో ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్న దులీప్ ట్రోఫీ మూడో రౌండ్ పోటీల్లో సూర్యకుమార్ ఆడనున్నాడు. ఇండియా ఎ, బి, సి, డి జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. సూర్యకుమార్ ఏ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడన్న వివరాలు బీసీసీఐ వర్గాలు వెల్లడించాల్సి ఉంది.

దౌర్జన్యకాండ..!

రెచ్చిపోయిన వైసీపీ మూకలు

- ఆక్రమణను తొలిగించేందుకు వెళ్లిన అధికారులను అడ్డుకున్న సర్పంచ్
- ఎక్స్‌కవేటర్ ధ్వంసం
- టీడీపీ కార్యకర్తలపైకి రాళ్లు
- మహిళలపై దాడి
- చెదళ్ల గ్రామంలో ఉద్రిక్తత



చెదళ్ల గ్రామంలో అధికారులను అడ్డుకుంటున్న వైసీపీ మూకలు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 17: మండలంలోని చెదళ్ల గ్రామంలో మంగళవారం వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. ఆక్రమించిన వాటర్ ప్లాంట్, ట్రెంచ్‌ను తొలిగించేందుకు వెళ్లిన రెవెన్యూ, పోలీసులను అడ్డుకున్నారు. ఆక్రమణలు తొలిగించేందుకు వెళ్లిన ఎక్స్‌కవేటర్‌ను వైసీపీ మద్దతు సర్పంచ్, అనుచరులు ధ్వంసం చేశారు. పోలీసులు చోద్యం చూశారు. వైసీపీ కార్యకర్తలను అదుపు చేయడంలో విఫలమయ్యారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. ఈ ఘటనతో సంబంధంలేని ముగ్గురు టీడీపీ మహిళా కార్యకర్తలపై వైసీపీ గూండాలు దాడి చేసి, గాయపరిచారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెదళ్ల గ్రామంలో వైసీపీ మద్దతు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ప్రభుత్వ స్థలం 7 సెంట్లు ఆక్రమించి, వాటర్ ప్లాంట్‌ను గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసుకున్నారు. ఆ స్థలాన్ని గతంలోనే మహిళా సాధికారిత భవనానికి కేటాయించారు. అలాంటి స్థలంలో వాటర్ ప్లాంట్ ఎలా నిర్మిస్తారని టీడీపీ నేతలు.. జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు.. ఆక్రమణను తొలిగించేందుకు చెదళ్ల గ్రామానికి వెళ్లారు. దీంతో ఒక్కసారిగా వైసీపీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, అతడి అనుచరులు.. అధికారులును అడ్డుకున్నారు. ఎలా తొలగిస్తారని వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వైసీపీ కార్యకర్త యరపరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని డబ్బా తీసుకుని తహసీల్దార్, సీఐ ముందుకు వచ్చి బెదిరించాడు. పోలీసులు.. అతడి వద్ద ఉన్న పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ఈ సమయంలో క్రిమిసంహారక మందు డబ్బా పగిలిపోయి, తహసీల్దార్, సీఐ కరుణాకర్‌పై పడింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై మందును క్లీన్ చేశారు.



వైసీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన ఎక్స్‌కవేటర్



గాయపడిన టీడీపీ మహిళా కార్యకర్త

మహిళలపై దాడి

వాటర్ ప్లాంట్ తొలిగింపు ఘటనకు సంబంధం లేని టీడీపీ మహిళా కార్యకర్తలపై వైసీపీ గూండాలు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. అదే గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్తలు చౌడమ్మ, నాగలక్ష్మి, పద్మావతి పుట్టినరోజు వేడుకలకు వెళ్తుండగా అక్కడే ఉన్న వైసీపీ కార్యకర్తలు దాడి చేసి, తీవ్రంగా కొట్టారు. వాటర్ ప్లాంట్ తొలిగించాలని ఫిర్యాదు చేస్తారా? ఎంత ధైర్యం అంటూ దాడికి తెగబడ్డారు. పోలీసులు ఉన్నా దాడిని అడ్డుకోలేకపోయారని టీడీపీ నేతలు వాపోయారు. గాయపడిన వారిని అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ కార్యకర్తలపైకి రాళ్లు

రోడ్డు వైపు ఉన్న టీడీపీ మాజీ సర్పంచ్ నారాయణస్వామి, ఆయన వర్గీయులపై వైసీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. దమ్ముంటే రండి అంటూ సవాల్ విసిరారు. అక్కడే ఉన్న పోలీసులు చోద్యం చూశారు. ప్రస్తుతం గ్రామంలో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

అక్రమాల్లో పోటీ!

ఇసుక అక్రమ రవాణాకు టీడీపీ నాయకుల పోటాపోటీ

పోలీస్ స్టేషన్‌కు చేరుతున్న పంచాయితీ



అర్ధరాత్రి వైరి వర్గానికి చెందిన టీడీపీ నాయకులు పట్టుకున్న ఇసుక ట్రాక్టరు

విడపనకల్లు, సెప్టెంబరు 17: ఇసుక అక్రమ రవాణాలో టీడీపీ నాయకులు పోటీ పడుతున్నారు. ఈక్రమంలోనే ఒకరి ట్రాక్టర్లను మరొకరు పట్టుకుంటున్నారు. వారంరోజుల కిందట కరకముక్కల గ్రామానికి చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు విడపనకల్లుకు వచ్చాయి. వాటి విషయం తెలుసుకున్న స్థానిక టీడీపీ నాయకులు విడపనకల్లు ఎస్ఐ ఖాజా హుస్సేన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కరకముక్కల టీడీపీ నాయకులు రంగంలోకి దిగి, తాము కూడా టీడీపీకి పని చేశామని, తమ ట్రాక్టర్లను కూడా పట్టిస్తారా అంటూ విడపనకల్లు నాయకులతో ఘర్షణకు దిగారు. స్టేషన్‌లో పంచాయితీ పెట్టి రూ.30వేలు ఇస్తాము ట్రాక్టర్లను వదిలేయాలని చర్చలు జరిపారు. అయితే ఆమాటలు వినని పోలీసులు రాత్రికి రాత్రే కేసు నమోదు చేశారు. ఈ ఘటన జరిగిన రెండు రోజులకు విడపనకల్లుకు చెందిన రెండు ఇసుక ట్రాక్టర్లు అర్ధరాత్రి సమయంలో వచ్చాయి. కాపుకాచిన కొంతమంది టీడీపీ నాయకులు ఆ ట్రాక్టర్లను పట్టుకుని విడపనకల్లు ఎస్ఐకి సమాచారం అందించా రు. రెండు ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుకను తరలిస్తూ ఉంటే వాటిని పట్టుకున్నామనీ, స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయాలని తెలిపినా ఎస్ఐ స్పందించలేదని టీడీపీ నాయకులే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వర్గం వారు చెబితే ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటారనీ, అదే వర్గం వారు అక్రమ ఇసుక రవాణా చేస్తే పట్టించుకోరా అంటూ విడపనకల్లు ఎస్ఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాక్టర్లను వదలకుండా అందులోని ఇసుకను మండల కేంద్రంలోని అమ్మవారి దేవాలయం ముందు వేయించారు. వైరి వర్గం టీడీపీ నేతలు రెండు రోజులు మిన్నకుండి మూడో రోజు రాత్రికి రాత్రే ఆ ఇసుకను మాయం చేశారు. బొమ్మనహాళ్ మండలానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు విడపనకల్లు మండలానికి చెందిన నాయకుడికి నెలకు రూ.లక్ష ఇస్తాననీ, ఇసుకను విడపనకల్లు మండలానికి రవాణా చేస్తానని చర్చలు జరిపినట్లు సమాచారం.

బహిరంగంగా సబ్సిడీ బియ్యం సేకరణ

మండలంలోని వివిధ గ్రామాల్లో సబ్సిడీ బియ్యాన్ని టీడీపీ నాయకులు బహిరంగంగానే సేకరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి కనీసం ఆరు మాసాలు కూడా కాకుండానే టీడీపీ నాయకులు అక్రమ వ్యాపారాలకు తెర లేపటంపై కొంత మంది టీడీపీ నాయకులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. పార్టీకి చెడ్డ పేరు తెచ్చేలా కొందరి వ్యవహార శైలి ఉందని విమర్శిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో కర్ణాటక మద్యం వ్యాపారం, మట్కా, పేకాటను నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఇన్ని వ్యవహారాలు జరుగుతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ విచారణ..

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17: జిల్లా వైద్య విధాన పరిషత్ పూర్వ అధికారి డాక్టర్ కృష్ణవేణిపై మళ్లీ విచారణ చేపట్టారు. ఆమె డీసీహెచ్‌ఎస్‌గా ఉన్న సమయంలో ఉద్యోగం వదిలేసిన వారిపేరున నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చేశారనీ, ఒకరికి రెండుచోట్ల జీతాలు చెల్లించారనీ, సొంత కారును అద్దె వాహనంగా చూపించి బిల్లులు చేసుకున్నారని తదితర ఆరోపణలపై కొందరు ఆధారాలతో రాష్ట్రశాఖకు ఫిర్యాదులు చేశారు. దీంతో మచిలీపట్నం డీసీహెచ్‌ఎస్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన వారం రోజుల క్రితం జిల్లాకొచ్చి విచారణ చేసుకుని వెళ్లి రాష్ట్ర అధికారులకు నివేదించారు. అవే ఆరోపణలపై రెండోసారి మంగళవారం మరో అధికారి విచారణ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్ అనంతపురం డీసీహెచ్‌ఎస్‌కు చేరుకుని, డాక్టర్ కృష్ణవేణిపై వచ్చిన ఆరోపణలు, ఫిర్యాదులపై రికార్డుల ఆధారంగా విచారించారు. ఈ విషయంపై డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్‌ను వివరణ కోరగా.. విచారణ వాస్తవమేననీ, విచారణాధికారి తిప్పేంద్రనాయక్ అడిగిన మేరకు రికార్డులు చూపించామని తెలిపారు. ఒకే ఆరోపణలపై వారంలోనే రాష్ట్రశాఖ ఉన్నతాధికారులు ఇద్దరు అధికారులతో విచారణ చేయించడం చర్చనీయాంశంగా మారింది

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

బెళుగుప్ప, సెప్టెంబరు 17: మండలంలోని గుండ్లపల్లి వద్ద మంగళవారం అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసినట్లు సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివతో కలిసి వివరాలు వెల్లడించారు. గుండ్లపల్లి సమీపంలో ఎస్ఐ వాహనాలను తనిఖీ చేస్తుండగా.. అనుమానాస్పదంగా వ్యవహరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, విచారించారు. అతడు కళ్యాణదుర్గం, ఉరవకొండ, ఆలూరు, బెళుగుప్ప ప్రాంతాల్లో తాళాలు వేసిన ఇళ్లలో దోపిడీలకు పాల్పడుతున్నట్లు తేలింది. అతడు కర్ణాటకలోని రాణిబెన్నూరుకి చెందిన పరశురామ్‌గా గుర్తించారు. ఇప్పటికే పది కేసుల్లో జైలుకి వెళ్లి వచ్చాడు. జూలై 24న బయటికి వచ్చి మళ్లీ చోరీలకు పాల్పడుతున్నాడు. పరశురామ్‌ను అరెస్టు చేసి, 40 గ్రాముల బంగారం, రూ.27 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

శ్రుతిమించిన చేతివాటం..!



కూడేరు ఎంఈఓ కార్యాలయం

- ఎంఈఓల వసూళ్ల బాగోతం
- ఏళ్లుగా ఒకేచోట ఉద్యోగం
- రూ.కోట్లకు పడగలెత్తిన వైనం

అనంతపురం విద్య, సెప్టెంబరు 17: చేతివాటం శ్రుతిమించింది. కొందరు మండల విద్యాశాఖాధికారు(ఎంఈఓ)లు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లనే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే టీచర్లను సైతం టార్గెట్ చేసి దోచేస్తున్నారు. కొందరు ఎంఈఓలు.. విజిట్లు చేసి, బెదిరిస్తూ... డబ్బు గుంజుతున్నారు. మరికొందరు.. ఉపాధ్యాయ సంఘాలను తమ చేతుల్లో పెట్టుకుని టీచర్లను టార్గెట్ చేసి, చర్యలు తీసుకుంటామంటూ ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలను ఆదాయ వనరులుగా మార్చుకుని, డబ్బు గుంజుతున్న ఎంఈఓలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో కోకొల్లలు. చాలామంది ఎంఈఓలు ఏడేళ్లుగా, మరికొందరు 12 ఏళ్లుగా స్థానికంగా ఉండటమే ఇందుకు బలం చేకూరుస్తోంది. అనేకమంది అక్రమ వసూళ్లకు తెరతీసి రూ.కోట్లకు పడగలెత్తారు. కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్‌ను ఏసీబీ అధికారులు ట్రాప్ చేశారు. ఈ క్రమంలో చాలామంది ఎంఈఓలు ఇదే వ్యవహారాల్లో తలమునకలవడంతో ఏసీబీ మరింత లోతైన దర్యాప్తు చేస్తే... మరికొందరు ఏసీబీ వలలో చిక్కడం ఖాయం అన్న చర్చ నడుస్తోంది.

వసూళ్లకు రెండువైపులా పదును

ప్రైవేట్, ప్రభుత్వ ఉపాధ్యాయులు, స్కూళ్లను లక్ష్యంగా చేసుకుని అక్రమ వసూళ్ల సాగిస్తున్నారు పలువురు ఎంఈఓలు. పలువురు ఎంఈఓలు.. కొందరు ఉపాధ్యాయులను స్కూళ్లకు పంపకుండా ఎమ్మార్సీల్లోనే ఉంచుకుంటున్నారు. గ్యాంగ్‌ను వెంటేసుకుని, కొంద రు స్కూళ్ల విజిట్‌కు వెళ్తారన్న విమర్శలు కూడా ఉన్నాయి. తమ కనుసన్నల్లో నడిచే టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కొందరు టీచర్ల లోపాలు గుర్తిస్తారు. తన అనుయాయ టీచర్ల ద్వారా వచ్చిన సమాచారం మేరకు స్కూళ్ల విజిట్ చేస్తారు. ధూం..ధాం... అంటారు. సీరియస్ యాక్షన్ అంటూ హెచ్చరిస్తారు. తర్వాత తన అనుచర టీచర్ల ద్వారా బేరసారాలకు దిగుతారు. 'సార్.... చర్యలు తీసుకోకుండా నేను మాట్లాడుతాను.. నేను చెప్పింది సర్దుబాటు చేయ్" అంటూ అనుయాయ టీచర్లు పావులు కదుపుతారు. అనుకున్న పైకం ఎంఈఓకు చేరగానే...ఇక ఏం చర్యలు ఉండవు. అదేవిధంగా సర్దుబాటు, బదిలీలు, నాడు-నేడు పనుల్లో సైతం వాటాలు లాగేస్తారు. అదేవిధంగా ప్రైవేట్ స్కూళ్ల ఇలా ప్రభుత్వ స్కూళ్ల విషయం ఇక చెప్పనక్కరలేదు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు అనుమతులు, గుర్తింపు, రెన్యూవల్ పేరు చెప్పి ఇబ్బంది ముబ్బడిగా పిండుకుంటున్నారు. రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షలు, రూ. 3 లక్షలు ఇలా ఎంత పడితే అంత లాగేస్తున్నారు. డీఈఓ ఆఫీస్, ఆర్‌జేడీ ఆఫీస్‌లోని అధికారుల పేర్లు చెప్పి కూడా కొందరు ఎంఈఓలు శ్రుతిమించి వసూళ్ల చేస్తున్నారు. ఈ క్రమంలోనే కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్ రూ.2 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం అందుకు దర్పణం పడుతోంది. ఇలా చాలా మందే ఉన్నారు.

బదిలీ కాకపోవడమే బరితెగింపునకు బలం..

మండలాల్లో చాలా మంది ఎంఈఓలు ఏళ్ల తరబడి బదిలీ కాకుండా స్థానికంగానే తిష్టవేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మెజార్టీ ఎంఈఓలు 7 ఏళ్ల నుంచి 12 ఏళ్ల వరకూ బదిలీకాకుండా మండలాల్లోనే పాతుకుపోయారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు చేపట్టకపోవడం వారికి కలిసొస్తోంది. ఉన్న మండలాల్లోనే తిష్టవేసుకుని, స్థానికంగా పట్టు సాధించారు. వీళ్లకు బదిలీలు నిర్వహించకపోవంతోనే భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఈనెల 2న 'వీళ్లకు బదిలీలు లేవా' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనం ప్రచురించింది. ఒక వైపు ఉపాధ్యాయులు, మరోవైపు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల కరస్పాండెంట్ల నుంచి ఎంఈఓల బదిలీలకు బలంగా డిమాండ్ చేస్తున్నారు. కూడేరు ఎంఈఓ చంద్రశేఖర్ 7 ఏళ్లకుపైగా స్థానికంగా ఉన్నారు. 2017 నుంచి కూడేరులో ఉన్నట్లు విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. ఈ బలంతోనే ప్రైవేటు స్కూళ్లలో వసూళ్లకు తెరతీసి అడ్డంగా ఏసీబీకి చిక్కారు. రెండు చేతులా అక్రమ వసూళ్లకు పాల్పడుతూ కొందరు ఎంఈఓలు రూ.కోట్లకు పడగలెత్తారు. ఏసీబీ మరింత దృష్టి సారిస్తే... మరిన్ని అవినీతి తిమింగలాలు బయట పడే అవకాశం ఉందన్న చర్చ విద్యాశాఖలో సాగుతోంది.

ఏసీబీ వలలో ఎంఈఓ



ఏసీబీ అదుపులో కూడేరు ఎంఈఓ

కూడేరు సెప్టెంబరు 17: అనంతపురం జిల్లా కూడేరు మండల విద్యాధికారి (ఎంఈఓ)-1 చంద్రశేఖర్ ఏసీబీ వలలో చిక్కాడు. అనంతపురం నగర శివారులోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద విరిడియన్ ఎకోలి స్కూల్‌లో పనిచేస్తున్న సిబ్బంది సాగర్ నుంచి మంగళవారం సాయంత్రం రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అనంతపురం ఇన్‌చార్జి డీఎస్పీ జెస్సీ ప్రశాంతి ఆ వివరాలు వెల్లడించారు. కూడేరు మండలం ముష్టూరు గ్రామ సమీపాన ఉన్న విరిడియన్ ఎకోలి పాఠశాల తనిఖీ సమయంలో తనకు రూ.2 లక్షలు లంచం ఇవ్వాలని ఎంఈఓ చంద్రశేఖర్ డిమాండ్ చేశాడు. లేదంటే పాఠశాలకు వ్యతిరేకంగా ప్రభుత్వానికి నివేదికలు పంపుతానని బెదిరించాడు. దీంతో పాఠశాల యాజమాన్యం.. ఏసీబీని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో అనంతపురం నగర శివారులోని ఏపీఐఐసీ కార్యాలయం వద్ద పాఠశాల సిబ్బంది నుంచి ఎంఈఓ రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీతోపాటు సీఐలు కృష్ణారెడ్డి, మోహన్‌కృష్ణ.. సిబ్బందితో కలిసి దాడి చేసి, పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకున్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జెస్సీ ప్రశాంతి తెలిపారు.

కార్మికుల సమ్మె విరమణ

కలెక్టర్‌తో ఫలించిన చర్చలు

విధుల్లోకి సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులు



కలెక్టర్‌తో చర్చలు జరుపుతున్న కార్మిక సంఘం నాయకులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 17: సత్యసాయి, శ్రీరామిరెడ్డి నీటి సరఫరా కార్మికులు మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌తో జరిపిన చర్చలు సఫలమయినట్లు యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓబులు తెలిపారు. 13 రోజులుగా చేపట్టిన కార్మికుల సమ్మెను విరమిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. బకాయి వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించేలా కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు. క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ అసెస్‌మెంట్ ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, కార్మికుల అక్రమ తొలగింపు ఆపాలని, రాజకీయ ఒత్తిళ్ల నుంచి కార్మికులకు రక్షణ కల్పించాలన్న డిమాండ్లతో వారు నిరవధిక సమ్మెకు దిగారు. పలుమార్లు అధికారులతో జరిపిన చర్చలు విఫలం కావడం చివరికి కలెక్టర్‌తోనే చర్చలు జరిపారు. కలెక్టర్ కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. చర్చల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర కార్యదర్శి వెంకటనారాయణ, రామాంజి, సత్యసాయి వాటర్ వర్క్స్ కార్మికులు తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు ఈశ్వరయ్య, శ్రీరాములు, మధుసూదన్ ఆచారి, ప్రసాద్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఏబీఆర్‌లో తాగునీటి పథకాల పునరుద్ధరణ



తాగునీటి పంపులను ఆన్‌చేస్తున్న కార్మికుడు



నీటిని శుభ్రం చేస్తున్న దృశ్యం

కూడేరు, సెప్టెంబరు, 17: పీఏబీఆర్ డ్యాంలోని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాలను పునరుద్ధరించారు. గత 13 రోజులుగా తాగునీటి కార్మికులు వేతనాల కోసం సమ్మెకు వెళ్లారు. మంగళవారం కలెక్టర్‌తో జరిగిన చర్చల్లో కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో పీఏబీఆర్ డ్యాంలోని తాగునీటి పథకాలకు కార్మికులు పంపులు ఆన్ చేసి నీటిని వదిలారు. దీంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తీరినట్లయింది.

జాతీయస్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక



స్వప్న



జ్యోతిరాం

ఉరవకొండ, సెప్టెంబరు 17: నియోజకవర్గంలోని ఉరవకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గడేహోతూరుకు చెందిన జ్యోతిరామ్, స్వప్న అనే విద్యార్థులు జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ప్రకాశం జిల్లా, జె.పంగలూరులో ఈనెల 15న జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్ బాలురు, బాలికల పోటీలు నిర్వహించారు. జిల్లా జట్టు తరఫున వీరు పాల్గొన్నారు. ఈ నెల26 నుంచి 30వ తేదీ వరకూ జార్ఖండ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీలు మారుతి, ప్రభాకర్ తెలిపారు.

ఆర్ఎంపీ వైద్యం వికటించి వ్యక్తి మృతి

పామిడి, సెప్టెంబరు 17: ఆర్ఎంపీ వైద్యం వికటించి పుల్లా ఆదినారాయణ(55) అనే వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని ఎద్దులపల్లిలో చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు... పుల్లా ఆదినారాయణ వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురయ్యారు. మంగళవారం ఓ ఆర్ఎంపీని ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్ వేయించుకున్నాడు. ఆ సమయంలో భోజనం చేశావా అంటే అవునని అబద్ధం చెప్పినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు చెప్పారు. ఇంజక్షన్ వేసిన కొద్ది సమయానికే అపస్మారక స్థితిలోకి వెళ్తుండడంతో గమనించిన ఆర్ఎంపీ, కుటుంబ సభ్యులు అదే గ్రామంలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి పామిడి సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. విషయం తెలుసుకున్న ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ ఆ కుటుంబాన్ని కలిసి ప్రాథమికంగా విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు సిఫార్సు చేశామన్నారు. ఈ మృతిపై పూర్తిగా విచారించి వివరాలు వెల్లడిస్తామన్నారు. పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పోలీసు సిబ్బంది కొరత తీర్చండి: ఎమ్మెల్యే



డీజీపీని కలిసిన కాలవ

రాయదుర్గం, సెప్టెంబరు 17 : జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డీజీపీ ద్వారకా తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే మంగళవారం సాయంత్రం మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ తిరుమలరావుని కలిశారు. సిబ్బంది కొరత వల్ల పోలీసులు విపరీతమైన పని భారాన్ని భరించాల్సి వస్తోందని తెలిపారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న రాయదుర్గం నియోజకవర్గంలోని ఐదు పోలీస్‌స్టేషన్లలో కానిస్టేబుళ్ల కొరత అధికంగా ఉందన్నారు. ఫలితంగా సరిహద్దులో నిఘాతో పాటు ఇతర పోలీసు కార్యక్రమాలకు ఇబ్బందికరంగా మారిందన్నారు.

పుట్టపర్తి - బెంగుళూరు రైలు

అనంత వరకు పొడిగింపు

రైల్వేశాఖ మంత్రికి ఎంపీ కృతజ్ఞతలు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 : పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్ రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు రైల్వే శాఖ మంత్రికి అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గత పార్లమెంట్ సమావేశాల్లో జిల్లాకు చెందిన ప్రజల చిరకాల కోరికైన అనంతపురం వరకు పుట్టపర్తి - బెంగుళూరు ప్యాసింజర్‌ను పొడిగించాలని రైల్వే శాఖ మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రైలును అనంతపురం వరకు పొడిగించినందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు.

టమోటా కిలో రూ.35

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.35తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మంగళవారం 3,150 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.28, కనిష్ఠ ధర రూ.17పలికినట్లు ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్ల ప్రారంభం వాయిదా

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17: నగరంలో బుధవారం నిర్వహించాల్సిన మూడు అన్న క్యాంటీన్ల ప్రారంభోత్సవాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం విజయవాడలో సమీక్షాసమావేశాన్ని నిర్వహిస్తుండడంతో వాయిదా వేశామన్నారు. తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తామన్న సమాచారాన్ని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

దిగుబడి తీయన.. ధర పుల్లన..!



కొర్రకోడు వద్ద విరగ్గాసిన ద్రాక్ష పంట

- విరగ్గాసిన ద్రాక్ష తోటలు
- పతనమైన ధరలు
- ఎగుమతి లేక ముఖం చాటేస్తున్న వ్యాపారులు
- తోటల్లోనే కుళ్లిపోతున్న పంట





కుళ్లిపోతున్న ద్రాక్ష కాయలు



కుళ్లిన కాయలను తొలగిస్తున్న కూలీలు

కూడేరు, సెప్టెంబరు 17 : సంప్రదాయ పంటలను వదిలి కొత్త ఒరవడితో ఉద్యాన పంటలు పండిస్తున్నా రైతులకు నష్టాలు తప్పడం లేదు. ద్రాక్ష సాగుచేసి దిగుబడి సాధిస్తున్నా మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరలకే విక్రయించాల్సి వస్తోంది. అనంతపురం జిల్లాలో చీనీ, మామిడి, టమోట వంటి పంటలు అమ్ముకోవడానికి మార్కెట్ సదుపాయం ఉన్నా.. ద్రాక్ష పంట అమ్ముకోవడానికి మార్కెట్ లేకపోవడంతో అన్నదాతలు విలవిలాడుతున్నారు. అనంతపురం జిల్లాలో 928.98 ఎకరాల్లో ద్రాక్ష సాగు చేస్తున్నారు. అందులో కూడేరు, కణేకల్లు, రాయదుర్గం, అనంతపురంరూరల్, రాప్తాడు, గార్లదిన్నె బెళుగుప్ప, నార్పల, ఆత్మకూరు, కుందిర్పి తదితర మండలాల్లో దిల్ కుషా (సీడ్) మానిక్ చమన్, సూపర్ సోనకా (సీడ్‌లెస్) రకాల ద్రాక్ష సాగు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా దిల్ కుషా ద్రాక్షను జిల్లాలో అత్యధికంగా కూడేరు మండలం కొర్రకోడు, జల్లిపల్లి, హసంపల్లి, తదితర గ్రామాల్లో పండిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 928.98 ఎకరాలు సాగు చేస్తుంటే.. అందులో కూడేరు మండలంలో 344.08 ఎకరాల్లో సాగు చేయగా.. రాప్తాడు మండలంలో 195.26 ఎకరాలు, బెళుగుప్ప 72.77 ఎకరాలు, అనంతపురం రూరల్ 63.07 ఎకరాలు, కణేకల్లు 50.12 ఎకరాలు, బుక్కరాయసముద్రం మండలంలో 37.58 ఎకరాలు, మిగిలిన మండలాల్లో కూడా అరకొరగా సాగు చేస్తున్నారు. కూడేరు మండలం కొర్రకోడు, జల్లిపల్లి గ్రామాల్లో ఒక్కొక్క రైతు రెండు నుంచి ఐదు ఎకరాల వరకు సాగు చేస్తున్నారు.

లక్షల్లో పెట్టుబడి.. వేలల్లో రాబడి

ద్రాక్ష పంట సాగు చేయాలంటే ప్రారంభం నుంచి లక్షల్లో పెట్టుబడి అవుతోంది. ఎకరా ద్రాక్ష సాగు చేయాలంటే రాళ్లు, కడ్డీలు పందిరితోపాట సాగుకు దాదాపు రూ.4 లక్షల వరకు పెట్టుబడి వస్తోంది. పంట మొదలైనప్పటి నుంచి కోత దశ వరకు వాడే క్రిమిసంహారక మందులు, కూలీల ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. ఈ ఏడాది ఎకరాకు 15 నుంచి 18 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. సరైన ధర వస్తుందన్న ఆశతో ఉన్న సమయంలో పూర్తిగా పతనమయింది. లక్షల్లో పెట్టుబడులు పెట్టినా వేలల్లో కూడా ఆదాయం రాలేదని రైతులు వాపోతున్నారు.

ముఖం చాటేసిన వ్యాపారులు

జిల్లాలో పండిన ద్రాక్ష పంటను కొనుగోలు చేసిన వ్యాపారులు బూటాన్, బంగ్లాదేశ్ తోపాటు ఒడిషా, కోల్‌కతా, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. బంగ్లాదేశ్‌తో భారతదేశానికి సరైన సంబంధాలు లేకపోవడంతో ద్రాక్ష పంట ఎగుమతులపై ప్రభావం పడింది. దీంతో ఇక్కడ పండిన పంటను ఇతర దేశాలకు ఎగుమతులు లేకపోవడంతో వ్యాపారులు కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. దేశంలోని పలు రాష్ట్రాలకు మాత్రమే పంట ఎగుమతి జరుగుతుండటంతో వ్యాపారులు ఎక్కువగా రాక ధర పూర్తిగా పడిపోయింది. గత సంవత్సరం టన్ను రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు ధర పలకగా.. ఈ ఏడాది టన్ను కేవలం రూ. 20వేల నుంచి రూ. 30 వేల వరకు పలుకుతోంది.

కుళ్లిపోతున్న పంట

ద్రాక్ష పంట వంద రోజులకే వస్తుంది. వందరోజులు దాటిన తర్వాత పంట అమ్ముకోలేక పోతే కుళ్లిపోతుంది. దిగుబడి ఎక్కువ రావడం, పంట ఎగుమతులు లేకపోవడతంతో కొనుగోలుకు వ్యాపారులు రావడం లేదు. రోజులు దగ్గర పడే కొద్దీ కాయలు కుళ్లిపోవడంతో అన్నదాతల్లో ఆందోళన ఎక్కువయింది. మరో పది రోజుల్లో పంటను అమ్ముకోలేకపోతే నష్టాలతో నట్టేట మునిగిపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెండు ఎకరాల తోటలో ద్రాక్ష సాగు చేశాను. పంట బాగా పండిన సమయంలోనే ధర పూర్తిగా పడిపోయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ద్రాక్ష ధర పతనం కావడంతో అప్పుల పాలయ్యాను. పంట సాగుకు లక్షలు పెట్టుబడులు పెట్టి దిగుబడి బాగా వచ్చిన సమయంలో వ్యాపారులు ముందుకు రాలేదు. పండించిన పంటను ఏమి చేయాలో అర్థం కావడం లేదు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ప్రకాష్, కొర్రకోడు

పెట్టుబడులు కూడా రాలేదు



నేను సాగు చేసిన రెండు ఎకరాల ద్రాక్ష పంటను అమ్ముకోవడానికి నానాకష్టాలు పడుతున్నా. పంటను అమ్ముకోవడానికి మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులు నిర్ణయించిన ధరకే ఇవ్వాల్సిన దుస్థితి నెలకొంది. రెండు ఎకరాలకు నాలుగు లక్షలు అప్పులు చేసి పెట్టుబడులు పెడితే.. చివరికి రెండు లక్షలు కూడా వచ్చే పరిస్థితి లేదు.

- పరుశురాం, కొర్రకోడు

భారీగా పెరిగిన పెట్టుబడులు



పోయిన సంవత్సరం ధర కొంచెం పెరిగింది. దీంతో ఈసా రి రైతులందరూ సాగుకు సిద్ధం కావడంతో పెట్టుబడు లు భారీగా పెరిగాయి. చెట్టు కటింగ్‌తోపాటు పలుసార్లు పనులు చేయించడానికి కూలీలు అవసరం కావడంతో ఖర్చులు పెరిగిపోయాయి. దీంతోపాటు క్రిమి సంహారక మందుల పెరగడంతో మరింత భారం పడింది. తీరా పంట అమ్ముకొనే సమయానికి ధర పడిపోవడంతో నష్టాలపాలయ్యాం.

- కుంటెన్న, కొర్రకోడు

కార్యదర్శిపై సర్పంచ్ భర్త దాడి

గంగినేపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి..

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

ఖండించిన తోటి ఉద్యోగులు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 17: విధి నిర్వహణలో ఉన్న సచివాలయ కార్యదర్శిపై వైసీపీ సర్పంచ్ భర్త దాడి చేసిన సంఘటన చెన్నేకొత్తపల్లి మండలంలోని గంగినేపల్లిలో ఆలస్యంగా వెలుగు చూసింది. కార్యదర్శి, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐ.రాము స్థానిక సచివాలయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. స్థానిక సర్పంచ్ శాంతమ్మ భర్త రాజు, మామ పక్కీరప్ప శుక్రవారం సచివాలయానికి వెళ్లారు. గ్రామంలో పైపులైన్ లీకేజీ పనులు పూర్తి చేసినట్లు తీర్మానం ఇవ్వాలని కార్యదర్శిని అడిగారు. పనులకు సంబంధించి ఫొటోలు ఇవ్వాలని అడగ్గా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు ఇచ్చామని తెలిపారు. తనకు కూడా ఫొటోలు ఇవ్వాలని కార్యదర్శి అడగడంతో నానా దుర్భాషలాడారు. సీట్లో కుర్చొని తీర్మానం రాస్తుండగా తమ విధులకు ఆటంకం కల్గిస్తూ తోటి సిబ్బంది, గ్రామస్థుల సమక్షంలో సర్పంచ్ భర్త దాడికి దిగాడు. దీంతో కార్యదర్శి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సోమవారం ఎంపీడీఓ గంగావతి, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కోరారు. సర్పంచ్ జీతం విషయంలో కూడా ఆమె మామ పక్కీరప్ప చాలాసార్లు సచివాలయానికి వచ్చి ఇష్టానుసారంగా మాట్లాడుతారని కార్యదర్శి ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... సచివాలయ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్పంచ్ భర్త రాజుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యదర్శి రాముపై దాడిని తోటి ఉద్యోగులు తీవ్రంగా ఖండించారు.

బద్రీనాథ్‌కు వెళ్లిన తాడిపత్రి వాసులు క్షేమం

ఫోన్‌లో యోగక్షేమాలు తెలుసుకున్న ఎంపీ అంబికా



బద్రీనాథ్ యాత్రలో చిక్కుకుపోయిన తాడిపత్రి వాసులు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17 : బద్రీనాథ్ యాత్రకు వెళ్లి తిరుగు ప్రయాణంలో కొండచరియలు విరిగిపడ్డంతో అక్కడే నిలిచిపోయిన తాడిపత్రి వాసులు సురక్షితంగా బయట పడ్డారు. ఈనెల 9న తాడిపత్రికి చెందిన 40 మంది బద్రినాథ్ యాత్రకు వెళ్లారు. తాడిపత్రి నుంచి ఢిల్లీ దాకా రైలులో వెళ్లి.. అక్కడి నుంచి రెండు బస్సులను అద్దెకు తీసుకొని బద్రీనాథ్‌కు చేరుకున్నారు. తిరుగు ప్రయాణంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బద్రినాథ్ గోశాల కొండచరియల ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే కొండచరియలు విరిగిపడడంతో అక్కడి యంత్రాంగం ఎక్స్‌కవేటర్లతో తొలగింపు పనులు చేపట్టింది. అటువైపు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. బుధవారం ఉదయం 11 గంటలకు వాహనాల రాపోకలను పునరుద్ధరించారు. ఈ పరిస్థితుల్లో దాదాపు 20 గంటలపాటు బస్సులోనే ఉండిపోవాల్సి వచ్చిందని తాడిపత్రికి చెందిన యాత్రికులు వాపోయారు. అక్కడ జరిగిన విషయాన్ని మంత్రి నారా లోకేశ్ క్యాంప్ ఆఫీస్‌కు తాడిపత్రికి చెందిన జనార్దన నాయుడు ఫోన్ ద్వారా తెలిపారు. స్పందించిన మంత్రి క్యాంప్ ఆఫీస్ అధికారులు, హోంశాఖ మంత్రి అనిత అక్కడి యంత్రాంగాన్ని సంప్రదించి తాడిపత్రికి చెందిన యాత్రికులను సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ యాత్రీకులకు ఫోన్‌లో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాము క్షేమంగా ఉన్నామని యాత్రికులు ఎంపీకి వివరించారు. ఢిల్లీలో యాత్రికులకు కావాల్సిన సదుపాయాలు కల్పిస్తామని ఎంపీ భరోసానిచ్చారు.

'నిధుల స్కాం' పై కలెక్టర్ విచారణ

ఏడు రోజుల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశం

అనంతపురం విద్య, సెప్టెంబరు 17: జిల్లా సాధారణ పరీక్షల మండలి(డీసీఈబీ)లో నిధుల స్కాంపై విచారణకు తొలి అడుగపడింది. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. డీసీఈబీలో నకిలీ ఉత్తర్వులు సృష్టించి నిధులు స్వాహా చేస్తుండటంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. వీటిపై విచారణ చేయించాలంటూ కలెక్టర్ ఆదేశించారు. దీంతో జిల్లా విద్యాశాఖాధికారి విచారణకు దిగారు. గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓతో విచారణ చేయించనున్నట్లు తెలిసింది. ఏడు రోజుల్లో విచారణ చేసి తనకు రిపోర్ట్ ఇవ్వాలన్న ఆదేశంతో విద్యాశాఖాధికారులు విచారణకు సిద్ధమయ్యారు.

లోగుట్టుగా స్కాం

జిల్లా విద్యాశాఖలోని డీసీఈబీలో భారీ స్కాం చోటుచేసుకుంది. 2023-24 విద్యాఏడాదికి సంబంధించిన ఎఫ్ఏ-3 ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ షీట్స్ ముద్రణ, సప్లయికి సంబంధించిన భారీ అక్రమాలు చోటుచేసుకున్నాయి. జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి అనంతపురం జిల్లాకు డీఈఓగా ఈ ఏడాది ఫిబ్రవరిలో వచ్చారు. ఆమె ఫిబ్రవరి 10న విధుల్లో చేశారు. డిసెంబరులోనే ఆమె పేరున కొన్ని ఉత్తర్వులు బయటకు వచ్చాయి. ఏకంగా రూ. 31.80 లక్షల వర్క్ ఆర్డర్ ఎఫ్ఏ-3 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాల ముద్రణ, సప్లయికి సంబంధించి రెండు ప్రింటింగ్ వర్క్ ఆర్డర్స్ ఇచ్చారు. ఈ వర్క్ ఆర్డర్‌తో పాటు, క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్స్ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే విద్యాశాఖతో సంబంధం లేకుండా, ప్రాపర్ ప్రొసీజర్ లేకుండా సృష్టించిన్న ఈ ఉత్తర్వులపై అనేక విమర్శలు వస్తున్నాయి.

భవిష్యత్తు గురించి ముందే ఎలా తెలుసు..!

జిల్లా సాధారణ పరీక్షల మండలి కార్యదర్శిగా పురుషోత్తంబాబు పని చేస్తున్నారు. డీసీఈబీ కార్యకలాపాలన్నీ ఆయనే చూస్తుంటారు. డీసీఈబీకి చైర్మన్‌గా డీఈఓ ఉంటారు. అయితే డీఈఓగా వరలక్ష్మి జిల్లాకు ఫిబ్రవరిలో వచ్చింది. అయితే డిసెంబరు 15వ తేదీనే ఆమె పేరుపై ఉత్తర్వులు సృష్టించారు. రూ.31.80 లక్షల పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్, క్వాలిటీ అష్యూరెన్స్ సర్టిఫికెట్స్ ఉత్తర్వులన్నీ డీఈఓ పేరుపైన ఉన్నాయి. ఫిబ్రవరిలో ఫలాన వాళ్లు డీఈఓగా వస్తారంటూ డీసీఈబీ వాళ్లు భవిష్యత్తు ఊహించి ముందుగానే ఆమె పేరు ఉత్తర్వులు రెడీ చేయడం జిల్లా విద్యాశాఖ అధికారులనే విస్మయానికి గురిచేస్తోంది. రూ.31.80 లక్షల వర్క్ ఆర్డర్, ఇతర ఉత్తర్వులపై డీసీఈబీకి చైర్మన్‌గా వ్యవహరించే డీఈఓ సంతకం తప్పనిసరిగా ఉండాలి. అయితే ఈ ఉత్తర్వుల్లో డీఈఓ సంతకమే లేదు. కేవలం డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తంబాబు సంతకం ఉండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. విచారణ జరిగితే కానీ నిజాలు నిగ్గు తేలేలా లేవు. కాగా డీసీఈబీలో నిధుల స్కాం, ఫేక్ ఉత్తర్వులపై డీఈఓను ఆంధ్రజ్యోతి ఆరా తీసింది. ఫిబ్రవరిలో మీరు జిల్లాకు వస్తే డిసెంబరులోనే ఎలా ఉత్తర్వులు వచ్చాయి? అనిప్రశ్నించగా ఆ విషయం తనకు తెలియదన్నారు. కలెక్టర్ విచారణకు ఆదేశించారని స్పష్టం చేశారు. గుత్తి డిప్యూటీ డీఈఓను విచారణకు ఆదేశించారని తెలిపారు. వారం రోజుల్లో ఎంక్వయిరీ రిపోర్ట్ ఇవ్వాలంటూ ఆదేశించినట్లు తెలిపారు.

వైద్యకళాశాలకు మరో 50 ఎంబీబీఎస్ సీట్లు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17 : అనంత మెడికల్ కళాశాలకు ఎన్ఎంసీ శుభవార్త అందించింది. అదనంగా మరో 50 ఎంబీబీఎస్ సీట్లు పెంచడమే కాక ఈ ఏడాది నుంచే అమలులోకి వచ్చేలా మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు మంగళవారం వెల్లడించారు. 2018-19లో 100 సీట్ల నుంచి 150 సీట్లకు పెంచగా, తాజాగా 150 సీట్ల నుంచి 200కు పెంచారని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2024-25 నుంచే ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరంలో 200 సీట్లకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే అడ్మిషన్లు మొదలయ్యాయని, పది రోజుల క్రితమే జాతీయ కోటా కింద ఏడుగురు, రాష్ట్ర కోటాకింద మంగళవారం 48 మంది మెడికల్ కళాశాలలో రిజిస్టర్ చేయించుకున్నారని తెలిపారు. గురువారం నాటికి తొలి అడ్మిషన్ల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు.

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోండి

కలెక్టర్ వినోద్‌కుమార్

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 17 : జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరూ పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విశ్వకర్మ జయంతిని పురస్కరించుకొని రాణీనగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమానికి కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ వసతిగృహ విద్యార్థినులు నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విశ్వకర్మ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమానికి 'పీఎం విశ్వకర్మ' అని పేరుపెట్టారని తెలిపారు. పనుల ఆధారంగా రాష్ట్రంలో 18 రకాలైన చేతివృత్తుల వారిని గుర్తించారని, వారికి ఆర్థికసహాయం అందించేందుకు పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఈ పథకం కింద ఎంపికై ప్రాథమిక శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు రుణ సౌకర్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారీ, తహసీల్దార్ హరిబాబు, వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్‌తో పాటు విశ్వకుల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడిపల్లికి 934 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 17: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు మంగళవారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 934 క్యూసెక్కుల ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 906 క్యూసెక్కులు, పీఏబీఆర్‌కు మరువ నుంచి 25 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఘనంగా మహాలయ పౌర్ణమి



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

కనగానపల్లి, సెప్టెంబరు 17: మండల వ్యాప్తంగా మహాలయ పౌర్ణమిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్తాపురం గ్రామంలో మహిళలు ఊరేగింపుగా బోనాలను మోసుకెళ్లి గ్రామ దేవత గంగమ్మకు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా అనంత పద్మనాభస్వామి వ్రతం

అనంతపురం కల్చరల్, సెప్టెటంబరు 17 : స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని వలీస్వామి ఆశ్రమంలో మంగళవారం అక్కల్‌కోట మహారాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో అనంత పద్మనాభస్వా మి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు చిట్టా శ్రీధర్, ప్రధాన కార్యదర్శి దేవనూరు సుందరం విజయ్‌కుమార్, కోశాధికారి కొండా రెడ్డి, చంద్రశేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే మంగళవారం సాయంత్రం నగర శివారులోని శివకోటి దేవాలయంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నియామకం

అనంతపురంరూరల్, సెప్టెంబరు17: ఆంధ్రప్రదేశ్ ఎరుకుల ప్రజా సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా గుజ్జల హరికృష్ణ నియమితులయ్యారు. ఆ మేరకు మంగళవారం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు సాకే చిరంజీవి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

అనంతపురంరూరల్, సెప్టెంబరు 17: మండల పరిధిలోని ఎ నారాయణపురం గ్రామంలో నిర్వహిస్తున్న ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ ఏడి రవి పరిశీలించారు. ఆయన మంగళవారం గ్రామంలోని రైతు సేవా కేంద్రాన్ని ఏఓ శశికళతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈ పంట నమోదుపై రైతులతో ఆరా తీశారు. అనంతరం గ్రామంలోని కంది, వేరుశనగ పంటల ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. ఏఈఓ మురళీకృష్ణ, గ్రామ ఉద్యాన సహాయకులు నాగలత, రైతులు పాల్గొన్నారు.

23లోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

శింగనమల, సెప్టెంబరు 17: పంటలు సాగు చేసిన మండలంలోని ఈనెల 23వ తేదీ లోగా ఈ క్రాప్ నమోదు చేసుకుని, ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయధికారి అన్వేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బంది ని సంప్రదించి ఈ క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ చేసుకోవాలని సూచించారు.

నేడు కొత్త కమిషనర్ రాక

అనంతపురం క్రైం: నగర కమిషనర్‌గా నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఇదివరకు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా, మున్సిపల్ ఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న పీవీవీఎస్ మూర్తి రిలీవ్ కానున్నారు. విశాఖపట్నం జోన్ ఆర్డీగా పనిచేస్తున్న నాగరాజును నగర కమిషనర్‌గా, పీవీవీఎస్ మూర్తిని సీడీఎంఏ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే.

ప్రతి విద్యార్థికీ ఉద్యోగం దక్కేలా చర్యలు

జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 17: బీటెక్ పూర్తిచేసిన ప్రతి విద్యార్థికి ఉద్యోగం కల్పించేలా ఉద్యోగం కల్పించేలా చర్యలు చేపట్టామని జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రాంగణ నియామ కాల ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు జేఎన్‌టీయూ విద్యార్థులకు కొలువులిచ్చేందుకు ఆసక్తిచూపుతు న్నాయని తెలిపారు. వాటి అవసరా లకు అనుగుణంగా విద్యతోపాటే ఉద్యోగ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మోస్చిప్ టెక్నాలజీ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు కల్పించేందుకు జేఎన్‌టీయూ కలికిరి, పులివెందుల, అనంతపురం, ఎస్వీ తిరుపతి, ట్రిపుల్ ఐటీ ఆర్కేవ్యాలి విద్యార్థులకు ప్రాంగణ నియామకాల కోసం రాత పరీక్షలు, ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీటూ వీసీ దేవన్న, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, డైరెక్టర్ విశాలి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జే.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూ బీఈడీ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా సోమశేఖర్

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 17 : ఎస్కేయూ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సోమశేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్ ఎంఎ లక్ష్మణరావు, బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, నాయకులు శివశంకర్, లక్ష్మీనారాయణ నూతన ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సాకే జయరాముడు

రాప్తాడు, సెప్టెంబరు 17: మండలకేంద్రానికి చెందిన మందల శీనా కుమారుడు మందల నారాయణస్వామి అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎస్‌జేఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత, టీడీపీ రాప్తాడు నాయకుడు సాకే జయరాముడు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి నారాయణస్వామిని పరామర్శించారు. వైద్య చికిత్స కోసం రూ. 10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేకాడుతున్న 11 మంది అరెస్ట్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 17 : నగరంలో పేకాడుతున్న 11మందిని టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మంగళవారం టూటౌన్ సీఐ శ్రీకాంత్, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. హౌసింగ్‌బోర్డులోని బయలు ప్రదేశం ఉన్న కంపచెట్లలో పేకాడుతున్న 11 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.2,58,330 నగదు, రెండు కార్లు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీకాంత్ హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

అనంతపురం క్రైం : అనంతపురం రూరల్ మండల పరిధిలోని పూలకుంట గ్రామంలో ఇటుకలపల్లి పోలీసులు కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇటుకలపల్లి ఎస్ఐ విజయకుమార్ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి 55 విస్కీ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

అనంతపురం క్రైం: నగరంలో మంగళవారంజరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. తపోవనం సర్కిల్‌లో అహ్మద్(51)అనే వ్యక్తి నడిచివెళ్తుండగా బెంగుళూరు నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన అహ్మద్ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

అనంతపురం క్రైం: రూరల్ మండల పరిధిలో ఓ మహిళ అదృశ్యమైంది. ఎన్ఆర్ కాలనీకి చెందిన సాలమ్మ ఈ నెల 3వతేదీ నార్పలకు వెళ్తానని చెప్పి బయలుదేరింది. ఆటోలో బస్టాండ్‌కు వెళ్లిందని కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఆమె నార్పలకు వెళ్లలేదు. బంధువుల ఇళ్లల్లో ఆరా తీసినా ఆచూకీ తెలియకపోవ డంతో కుటుంబసభ్యులు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

డ్రిప్ మంజూరులో ప్రథమ స్థానంలో నిలవాలి

● అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 17: డ్రిప్ పరికరాల మంజూరులో జిల్లా దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రత్యేక చొరవ చూపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులకు ఆదేశించారు. ఆయన మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏపీఎంఐపీ అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ ఏడాది జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింకర్ల మంజూరు కోసం ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ఇప్పటి దాకా 33,331 మంది రైతులు 48099 హెక్టార్లకు డ్రిప్ మంజూరు కోసం రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకున్నారన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్ల సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్న 28 కంపెనీలు నిర్దేశించిన మేరకు లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింకర్లు మంజూరు చేసేలా వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ అధికారులు చొరవ చూపాలన్నారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఏపీఎంఐపీకి సంబంధించి వదల రోజుల యాక్షన్ ప్లాన్‌లోని 7200 హెక్టార్లల్లో డ్రిప్ మంజూరు ప్రక్రియను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, జిల్లా ఉద్యానాధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్, పలువురు అధికారులు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముమ్మర సాధన

రేపట్నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17: దులీప్ ట్రోఫీ మూడో రౌండ్ క్రికెట్ పోటీలు గురువారం నుంచి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభం కానున్నాయి. ఇందుకు దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఏసీజీలో ఇండియా ఏ, బీ, సీ, డీ జట్ల ప్లేయర్లు మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నెట్ ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఉదయం ఇండియా-సి, ఇండియా-బి, మధ్యాహ్నం ఇండియా-ఎ, ఇండియా-డి జట్ల ఆటగాళ్లు సాధన చేశారు. ఏసీజీ -ఎ గ్రౌండ్‌లో గురువారం ఇండియా-ఎ, ఇండియా-సి జట్ల మధ్య... ఏసీజీ - బి స్టేడియంలో ఇండియా-బి, ఇండియా-డి జట్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. పాసుల పంపిణీ, ఇతర అంశాలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. కేవలం ఒక రోజు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ దులీప్ ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు నిర్వహణపై వివరాలు ప్రకటించకపోవడం గమనార్హం. క్రికెట్ అభిమానులు నిర్వహ కుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇంకా నాలుగు జట్ల క్రీడా కారుల వివరాలు బీసీసీఐ ప్రకటించాల్సి ఉంది.



నెట్ ప్రాక్టీసు చేస్తున్న క్రికెటర్లు

పిల్లల ఆరోగ్యం కోసమే ఆల్బెండజోల్

ఏడాది నుంచి 19ఏళ్ల వరకు వేయించాలి: కలెక్టర్



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 17: పిల్లలు ఆరోగ్యంగా ఉండడంకోసం నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేయించాలని కలెక్టరు డాక్టరు వినోద్ కుమార్ సూచించారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం డీవార్మింగ్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నతపాఠశాలలో కలెక్టరు చేతుల మీదుగా పిల్లలకు మాత్రలు ఇచ్చి మింగించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నులిపురుగుల వల్ల పిల్లలలో రక్తహీనత ఏర్పడి, వారి ఎదుగుదల తగ్గి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువుతో పాటు అన్నిరకాలుగా సంతోషంగా ఉంటారన్నారు. అందుకే తల్లితండ్రులు ఏడాది పిల్లవాడినుంచి 19ఏళ్ల వరకు ఆల్బెండజోల్ మాత్రలను తప్పకుండా వేయించాలని కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, డీఈఓ వరలక్ష్మి, డీసీహెచ్ఎస్ రవికుమార్, ఐసీడీఎస్‌పీడీ శ్రీదేవి, డిప్యూటీ మేయర్లు కొగటం విజయభాస్కరరెడ్డి, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని యర్రగుంట్ల ప్రాథమిక పాఠశాలలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురుకుమార్, ఆరోగ్య విస్తరణాధికారులు నాగేశ్వరయ్య, భరణి, సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతే ఆరోగ్యరక్ష

అనంతపురం సెంట్రల్: వ్యక్తిగత పరిశుభ్రతే మానవ ఆరోగ్యరక్ష అని అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం వ్యక్తిగత పరిశుభ్రత- నులిపురుగులు' అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ శ్వేత మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించకపోవడం, సరిగా వండని, కలుషిత ఆహారం, జంక్‌ఫుడ్ తీసుకోవడంతో వర్మ్ ఇన్ఫెక్షన్ అవుతుందని తెలిపారు. మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణతోనే రోగికి మెరుగైన వైద్యం

అనంతపురం టౌన్, సెప్టెంబరు17: వ్యాధి నిర్ధారణతోనే రోగులకు మెరుగైన వైద్యం అందించడానికి అవకాశం ఉంటుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని వైద్యకళాశాలలో మంగళవారం ప్రపంచ రోగుల భద్రత దినోత్సవంపై సదస్సు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ... ఏ రోగికైనా వ్యాధినిర్ధారణ ఎంతో ముఖ్యమని, అపుడే డాక్టర్లు సరైన వైద్యం అందించగలరన్నారు. ఈ విషయాన్ని ప్రజలుకూడా గమనించి డాక్టర్లకు సహకరించాలన్నారు.

ఊరూరా స్వచ్ఛతాహి సేవ

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

మండలకేంద్రాలు, గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాల విద్యార్థులతో కలిసి ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత, పరిశుభ్రత, పారి శుధ్యంపై నినాదాలు చేశారు. వాటిపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం అక్టోబరు 1వతేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల, పంచాయతీ అధికారులు, సచి వాలయాల సిబ్బంది, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. అనంతపురం రూరల్, గార్లదిన్నె, శింగనమల, రామగిరి, చెన్నేకొత్తపల్లి, రాప్తాడు తదితర మండలాల్లో కార్యక్రమం నిర్వహించారు.

ప్రజానాయకుడు.. ప్రధాని మోదీ

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు



రక్తదాన శిరబిరాన్ని ప్రారంభిస్తున్న సందిరెడ్డి శ్రీనివాసులు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 17: పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రజానాయకుడిగా ఖ్యాతి గడించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని టవర్‌క్లాక్ సమీపంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సందిరెడ్డి శ్రీనివాసులు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. నాయకులు లలిత్‌కుమార్, రామచంద్రయ్య, చిరంజీవిరెడ్డి, చలపతి, అశోక్‌రెడ్డి, అజేష్‌యాదవ్, సూర్యప్రకాష్, చైతన్యకిషోర్, భరత్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను చెన్నే కొత్తపల్లిలో కూటమి నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నాయకులు జిలకర అంజనేయులు, మండల అధ్యక్షుడు శివమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జనసేన మండల కన్వీనర్ క్రాంతికుమార్, టీడీపీ గాండ్లసాధికారిక సమితి సభ్యులు గార్లదిన్నె భాస్కర్, మాజీ ఎంపీటీసీ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జిల్లా సర్వజనాస్పత్రిలో రక్తదాన శిబిరం

అనంతపురం టౌన్, సెప్టెంబరు17 : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా మంగళవారం సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా జిల్లా సర్వజన ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించిన ఈ శిబిరంలో 50మందిరక్తదానం చేశారు. రక్తదాతలకు సూపరింటెండెంట్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, క్షయ నివారణ విభాగం ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్, బ్లడ్‌బ్యాంకు వైద్యాధికారులు డాక్టర్లు శ్రీనివాసులు, దివ్య, శ్రీధర్, టెక్నీషియన్‌లు రమణారెడ్డి, మురళి, స్టాఫ్‌నర్సు విజయలక్ష్మి పాల్గొన్నారు.

అయిల్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 17: జిల్లా కేంద్రంలోని పలు అయిల్ మిల్లులపై మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సుభాష్‌రోడ్డులోని వెంకటరమణ ఆయిల్ మిల్, గుత్తిరోడ్డులోని జెమిని ఎడిబల్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్, బుక్కరాయసముద్రంలోని గాయత్రీ ఆయిల్ అండ్ రైస్ మిల్ తనిఖీలు చేపట్టారు. పై కేంద్రాలలో తూనికలు కొలతల నిబంధనలు పాటించనందున రూ.25,000 అపరాధ రుసుం విధించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. శాంపుల్స్ సేకరించి పరీక్షా కేంద్రానికి పంపామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఓ వాసుప్రకాస్, డీసీటీఓ విజయలక్ష్మి, సురేష్, డీఈఈ రవీంద్ర నాథ్, ఎస్ఐ ఫణీంద్రనాథ్, ఏజీ శివప్రసాద్, లీగల్‌మెట్రాలజీ అధికారి మహమ్మద్ గౌస్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ అధికారి తస్లీమా పాల్గొన్నారు.

ఊరూరా అభివృద్ధి పనులు చేస్తాం

● టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి

రాప్తాడు, సెప్టెంబరు 17: ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు ఊరూరా అభివృద్ధి పనులు చేస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని బుక్కచెర్ల, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించారు. బుక్కచెర్ల నుంచి తోపుదుర్తికి వెళ్లే దారి బాగు చేసేందుకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. బుక్కచెర్ల చెరువుకు నీరు వచ్చే పిల్ల కాలువ పూడిపోవడం వలన బుక్కచెర్ల, కాట్నేకాల్వ, కక్కలపల్లి చెరువులకు గత ప్రభుత్వంలో సక్రమంగా నీరు సరఫరా కాలేదన్నారు. దీంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. కాలువ మరమ్మతు పనులు ప్రారంభించారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ప్రారంభించారు. టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల్లో వనమహోత్సవం



మొక్కలు నాటుతున్న ఎస్కేయూ రెక్టార్, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 17: ఎస్కేయూ ప్రాంగణ పరిసరాలను హరితవనంలా తీర్చిదిద్దుతామని రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు పేర్కొన్నారు. వర్సిటీ వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ రవిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు మొక్కలు నాటారు. వర్సిటీలో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు కోసం వివిధ దేశాలు, ప్రాంతాలకు చెందిన దాదాపు ఆరు వేల రకాల మొక్కలు పెంచుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు జీవీ రమణ, మురళీధరరావు, ప్రిన్సిపాల్ సోమశేఖర్, డీఆర్‌లు తిమ్మప్ప, శ్రీరాములు నాయక్, జీవీ చౌదరి, ఎస్ఈ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ కోరి మొక్కలు నాటారు. దాదాపు 500 ఎకరాల విస్తీర్ణంతో ఏర్పాటుచేసిన కొత్తవర్సిటీ ప్రాంగణంలో మొక్కలునాటి వచ్చే సంవత్సరానికి వనాన్ని తలపించేలాప్రణాళిక తయారుచేశామని తెలిపారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఏపీడీ

రాప్తాడు: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వాటర్‌షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాప్తాడులో రైతు తలారి లక్ష్మీనారాయణ పొలంలో 'అమ్మ పేరుతో ఒక చెట్టు' కార్యక్రమంలో భాగం గా మంగళవారం మామిడి మొక్కలు నాటారు. ఉద్యాన పంటలు సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని, రైతులుసద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ అనూరాధ, సర్పంచ్ తిరుపాలు, టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, ఏపీఓలు సావిత్రి, సాకే జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి పెట్టండి: ఎమ్మెల్యే



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, సెప్టెంబరు17: నియోజకవర్గంలోని గ్రామల్లో తాగునీటి సమస్యను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కారించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. ఎమ్మెల్యే మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ... నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సాగునీటి గురించి రైతులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. హెచ్ఎల్‌సీ ద్వారా సరఫరా అయ్యే సాగునీరు సరిగా అందక బుక్కరాయసముద్రం, నార్పల మండలాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు ప్రత్యేక దృష్టికి ఉంచాలన్నారు. త్వరలో జరిగే ఉమ్మడి అనంతపురం, కర్నూల్ జిల్లాల నీటిపారుదల సమావేశంలో ఉన్నతాధికారులకు అందించేందుకు... నియోజకవర్గంలోని తాగు, సాగునీటి సమస్యలపై నివేదికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించా రు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మహిళా కార్యకర్తలపై దాడి హేయం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి



మహిళా కార్యకర్తలను పరామర్శిస్తున్న రామలింగారెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు17: మండల పరిధిలోని చెదళ్ల గ్రామంలో టీడీపీ మహిళా కార్యకర్తలపై వైసీపీ గుండాలు చేసిన దాడి హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు అన్నారు. వైసీపీ గుండాల చేసిన దాడిలో గాయపడిన మహిళా కార్యకర్తల పద్మావతి, చౌడమ్మ , నాగలక్ష్మిని వారు మంగళవారం అనంతపురం సర్వజనాసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పోలీసులు ఎదుటే మహిళలని చూడకుండా దాడి చేయడం పోలీసుల వైఫల్యమని వాపోయారు. వెంటనే దాడి చేసిన వారిపై హత్యాయత్నం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బుధవారం పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ అశోక్, నాయకులు ఎస్ నారాయణస్వామి, మల్లేశు, కేశన్న తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలని వినతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 17: బీసీలకు ఎన్నో ఏళ్ల కలగా మారిన బీసీ భవన్ ఏర్పాటుకు జిల్లా కేంద్రంలో మూడెకరాల స్థ లం కేటాయించాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు కోరారు. ఈ మేరకు మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కలెక్టర్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి సురేంద్రగౌడ్, బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షుడు వాల్మీకి చంద్రాచర్ల హరి, నాయకులు సంగాల లక్ష్మీనారాయణ, విజయ్‌కుమార్, రామ్మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద పిచ్చిమొక్కల తొలగింపు

శింగనమల, సెప్టెంబరు17: మండలపరిధిలోని చిన్నజలాలపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలను అంగన్‌వాడీ సిబ్బంది తొలగించారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన ఐసీడీఎస్ సీడీపీఓ ఉమాశంకరమ్మ, సూపర్‌వైజర్ ధనలక్ష్మి అంగన్‌వాడీ కేంద్రం వద్ద సిబ్బందితో కలిసి శ్రమదానం చేశారు. గడ్డిని, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

'కుష్టు రోగులకు శస్త్ర చికిత్సలు'

అనంతపురం టౌన్, సెప్టెంబరు17: కుష్టువ్యాధితో అంగ వైకల్యం వచ్చిన రోగులకు ప్రత్యేకంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అనుపమజేమ్స్ తెలిపారు. ఇందుకు సంబంధించి జిల్లా ఆస్పత్రి ఆవరణంలో ఉన్న సెంటర్‌లో మంగళవారం పలమనేరుకు చెందిన ఏమాస్ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టారు. రోగి ఇక్కడ అంగవైకల్యం గుర్తించి వారికి అవసరమైన వస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ఈ డాక్టర్ల బృందం 18న కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రి, 19న ఉరవకొండ, గుంతకల్ ప్రభుత్వాస్పత్రులలో, 20న గుత్తి ప్రభుత్వ ఆస్పత్రిలో, 21న తాడిపత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అంతవైకల్యం ఉన్నవారిని గుర్తించి, వారికి అవసరమైన శస్త్ర చికిత్సలు చేస్తామని డాక్టర్ అనుపమజేమ్స్ తెలిపారు. ఈక్యాంపులో డాక్టర్ గంగాధరరెడ్డి, డాక్టర్ శివారెడ్డి, పలమనేరు ఏమాస్ ఫిజియోథెరపీ వైద్యులు జాన్‌పీటర్ తదితరలు పాల్గొన్నారు.


సూపర్ స్పెషాలిటీలో ఆర్ఓ ప్లాంట్

అనంతపురం టౌన్, సెప్టెంబరు17: నగరంలోని శారదానగర్ సమీపంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రోగులకు తాగునీటి సమస్య పరిష్కరించేందుకు సప్తగిరి క్యాంఫర్ అధినేత ముందుకొచ్చారు. ఆయన ఆస్పత్రిలో రూ 16లక్షలు విలువ చేసే నూతన ఆర్ఓ ప్లాంట్‌ను విరాళంగా అందజేశారు. ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు చేతులమీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆర్ఓ ప్లాంట్ దాత హనీఫ్‌ను అభినందించారు, కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రేపు జూడో ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల స్థాయి జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలను గురువారం అనంతపురంలోని గుడ్ చిల్డ్రన్స్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ రెండు జిల్లాల కార్యదర్శులు మోరార్జీయాదవ్, సుగుణమ్మ తెలిపారు. అండర్-14 బాలురకు, బాలికలకు పోటీలు ఉంటాయన్నారు. 2011 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జననధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాంతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు తిరుపతిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9440243423, 8919011628ను సంప్రదించాలని తెలిపారు.

జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 17: జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక అనంతపురం క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేశవరెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎంవీ పాండురంగయ్య, సహాయ కార్యదర్శిగా గల్లా హర్ష, కోశాధికారిగా మేడా రాజేష్, కార్యవర్గసభ్యులుగా రాఘునాథ్ రెడ్డి, సీఎస్ ప్రసాద్, కిశోర్, రాజేంద్రనాథ్, జీసీ నరసింహులు, అగిశం రంగనాథ్ ఎన్నికయ్యారు. జిల్లాలో టేబుల్ టెన్నిస్ క్రీడ, క్రీడాకారుల అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామని వారు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, సెప్టెంబరు 17: మండలంలోని సజ్జల దిన్నె గ్రామ సమీపంలో మంగళవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పెన్నానది నుంచి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తుండడంతో సిబ్బందితో దాడి చేసి పట్టుకుని సీజ్ చేశామని, అలాగే డ్రైవర్లు శంకర్, శివను అరెస్ట్ చేశామని తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని అశోక్‌పిల్లర్ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. అలాగే సజ్జలదిన్నె గ్రామానికి చెందిన డ్రైవర్లు అశోక్, చంద్రశేఖర్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

యాడికి: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్‌చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. పెద్దపప్పూరు మండలం పెద్దయక్కలూరు గ్రామానికి చెందిన ఆదినారాయణ పెన్నానది నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమ రవాణా చేస్తుండగా రాయలచెరువులోని నగరూరు క్రాస్ వద్ద సీజ్ చేసినట్లు తెలిపారు. డ్రైవర్ ఆదినారాయణ, యజమాని అమర్‌నాథ్‌రెడ్డిపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు. సీజ్‌చేసిన ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు.

గుమ్మఘట్ట: మండలంలోని వేదావతి హగరి నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండడంతో పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు.

20న ఆటల పోటీలు

పుట్లూరు, సెప్టెంబరు 17: మండలంలో ఈనెల 20, 21న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖాధికారులు శ్రీదేవి, ప్రేమ్‌కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, చెస్, బ్యాడ్మింటన్, వాలీబాల్, యోగా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వరదబాధితుల కోసం విరాళాల సేకరణ

తాడిపత్రి, సెప్టెంబరు 17: విజయవాడ వరదబాధితుల కోసం పట్టణంలోని రోటరీక్లబ్ సభ్యులు మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ రూ.లక్ష మేర విరాళాలు సమకూరాయన్నారు. ఈ మొత్తాన్ని విజయవాడకు పంపించనున్నట్లు తెలిపారు. సభ్యులు రఫీ, సంజన్న, బాలసుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్, అబ్దుల్‌రహీం, గిరి, ఇన్నర్‌వీల్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్ఐగా రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

యల్లనూరు, సెప్టెంబరు 17: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్ఐగా రాంప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న గిరిబాబు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. దీంతో కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఈ స్థానంలోకి వీఆర్‌లో ఉన్న రాంప్రసాద్‌ను నియమించారు.

జీఆర్పీ డీఎస్పీ అజీజ్ సేవలు భేష్

గుంతకల్లు, సెప్టెంబరు 17: బదిలీపై వెళ్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్ విధినిర్వహణలో అత్యుత్తమమైన సేవలు అందించారని జీఆర్పీ ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. డీఎస్పీ అజీజ్ గుంతకల్లు జీఆర్పీ నుంచి గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. దీంతో మంగళవారం ఉదయం స్థానిక రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ డీఎస్పీ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈసందర్భంగా జీఆర్పీ ఎస్పీ మాట్లాడుతూ అజీజ్ సేవలను ప్రశంసించారు. తర్వాత సీఐ నగేశ్ కుమార్, సిబ్బంది, తదితరులు డీఎస్పీని సన్మానించారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, సెప్టెంబరు 17: మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన అమరేష్ (33) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. సత్యనారాయణ, శివమ్మ దంపతుల కుమారుడు అమరేష్ అల్ట్రాటెక్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసేవాడు. కొన్నాళ్లుగా పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఎక్కడా కుదరకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన అతను తన తోటలో మామిడిచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో మరొకరు..

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 17 : మండలంలోని ఉప్పొంగి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే గ్రామానికి చెందిన శ్రీకాంత్ (28) బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా ఇంటి అవసరాలకు రూ. 5లక్షల మేర అప్పులు చేశాడు. వాటిని తీర్చేదారి లేకపోవడంతో నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య మమత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల విక్రయానికి దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 17: దీపావళి పండుగ సందర్భంగా టపాసుల విక్రయానికి తాత్కాలిక లైసెన్స్ పొందుటకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి మంగళవారం పకటనలో తెలిపారు. దరఖాస్తుదారుడు ఫారం ఏఈ-5తో పాటు, నివాస ధ్రువీకరణ పత్రం, ఇన్‌కమ్ సర్టిఫికెట్, 5పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోలు, రూ. 500 చలానాను హెడ్‌ఆఫ్ అకౌంట్‌లో జమ చేయాలన్నారు. నాలుగు సెట్ల దరఖాస్తులను అక్టోబరు 7వ తేదీలోపు రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారుల విచారణ అనంతరం అర్హత బట్టి జీఎస్టీ, ఫైర్ చలానా, ఎన్ఓసీ సమర్పించిన వారికి మాత్రమే లైసెన్స్ మంజూరు చేస్తామన్నారు. ఈ సంవత్సరం దరఖాస్తు చేసుకుని లైసెన్సులు పొందిన వారు మాత్రమే టపాసుల విక్రయానికి అర్హులన్నారు. గతంలో పొందిన లైసెన్స్ చెల్లుబాటు కావని ఆయన పేర్కొన్నారు.

సాంకేతిక నైపుణాభివృద్ధిపై శిక్షణ

గుత్తి, సెప్టెంబరు 17: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సాంకేతిక నైపుణాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నట్లు ఐసీటీ రాష్ట్ర అధ్యక్షుడు దినకర్‌రెడ్డి తెలిపారు. ఎంప్లాయిబులిటీ అనే కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభించామని, అందులో భాగంగా ఇంజనీరింగ్ చదువుతున్న 48వేల మంది విద్యార్థులకు వివిధ రంగాల్లో సాంకేతిక నైపుణాభివృద్ధిపై శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఇందుకు రాయలసీమలో కేవలం నాలుగు ఇంజనీరింగ్ కళాశాలలను మాత్రమే ఎంపిక చేశామని, అందులో గేట్స్ కళాశాల ఒకటని అన్నారు. ఈమేరకు మంగళవారం విద్యార్థులకు శిక్షణ ప్రారంభించామన్నారు. వెబ్ డెవలప్‌మెంట్ అప్లికేషన్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీటీ జిల్లా అధికారి ప్రవీణ్, ప్రాజెక్టు మేనేజరు ప్రశాంత్, ట్రైనర్ రుద్రలక్ష్మీనాయుడు, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సమత తదితరులు పాల్గొన్నారు.

రైళ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలి

గుంతకల్లు, సెప్టెంబరు 17: రైల్వే స్టేషన్ పరిసరాలతో పాటు రైళ్లను కూడా పరిశుభ్రంగా ఉంచాలని, అప్పుడే నిజమైన ప్రజా సేవ అని డీఆర్ఎం విజయకుమార్ అన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం ఆయన ఉద్యోగులతో కలిసి స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛ రైల్- స్వచ్ఛ భారత్ సందేశాన్ని చదివి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబార్డినేట్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



యాడికిలో ర్యాలీలో పాల్గొన్న జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ



ఉరవకొండలో అధికారుల ర్యాలీ..



కళ్యాణదుర్గం మండలం దురదకుంటలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ గరికపాటి అరుణమ్మ, విద్యార్థులు

ఊరూరా స్వచ్ఛతాహి సేవ

● యాడికిలో అవగాహన ర్యాలీ ప్రారంభించిన జాయింట్ కలెక్టర్

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ సౌజన్యంతో నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గ కేంద్రాలతో పాటు వాటిల్లోని అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇందుకు సంబంధించిన అవగాహనా ర్యాలీలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి నిర్వహించారు. అలాగే ప్రధాన సర్కిళ్లలో మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా అధికారులు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం గురించి ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఈ మేరకు ప్రతిజ్ఞ కూడా చేయించారు. అక్టోబరు 1వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతాహిసేవలో రోజువారిగా ఏమేమి కార్యక్రమాలు చేపట్టే వివరాలను వెల్లడించారు. వాటిల్లో ప్రజలు భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. తర్వాత పలు వీధుల్లో శ్రమదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఎంఈఓలు, హెచ్ఎంలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు. యాడికి మండలకేంద్రంలో జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, డీపీఓ ప్రభాకర్‌రావుతో కలిసి స్వచ్ఛతాహి సేవ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడమే మనం సమాజానికి చేసే సేవ అని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ వారిని సన్మానించారు. తర్వాత మార్కెట్ వీధిలో శ్రమదానం నిర్వహించారు.

నులిపురుగులను నివారించండి

● జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్



విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి

పామిడి, సెప్టెంబరు 17 : చిన్నారులలో నులిపురుగులను నివారించినప్పుడే వారు అభివృద్ధి చెందుతారని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆయన విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్‌బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నులి పురుగులు నివారణ అయినప్పుడే చిన్నారులకు అవసరమైన పోషక విలువలు అందుతాయన్నారు. అప్పుడే ధృడంగా, ఆరోగ్యవంతంగా తయారవుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, సూపర్‌వైజర్ శ్రీరామిరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

యాడికి: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. పెన్నాసిమెంట్స్ ఫ్యాక్టరీలోని పాఠశాలలో ఏర్పాటుచేసిన మాత్రల పంపిణీలో మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామన్నారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ రాంప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: మండలకేంద్రంలో ఎంపీడీఓ రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. 1నుంచి 19 ఏళ్ల లోపు వయసున్న బాలబాలికలు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలను తీసుకోవాలని ఆరోగ్య సిబ్బంది తెలిపారు. ప్రతి పాఠశాలలో అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

బెళుగుప్ప: మండలంలోని కాలవపల్లి, రమణేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు శ్రీరంగాపురం, బెళుగుప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ప్రోగ్రామ్ అధికారి రవి శంకర్, ఎంపీహెచ్ఈవో విజయ్ కుమార్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి కేశవ్‌తో టీడీపీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 17: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను టీడీపీ మండల కన్వీనర్ బీడీ మారయ్య తదితరులు అమరావతిలోని సచివాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో తాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే వ్యవసాయానికి 9గంటల విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఉరవకొండ, సెప్టెంబరు 17: పట్టణంలోని మహాత్మా డిగ్రీ కళాశాల విద్యార్థి ఫణీంద్ర చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 13నుంచి15వ తేదీ వరకూ భీమవరంలో జరిగిన ఇంటర్నేషనల్ బీ 16వందల రేటింగ్ టోర్నమెంట్‌లో ఫణీంద్ర మొదటి స్థానం సంపాదించి రూ.10వేల నగదును, ట్రోఫీని గెలుపొందాడు. ఇందుకు గాను ఆ విద్యార్థిని కళాశాల అధ్యాపకులు బుధవారం శాలువా, పూలమాలతో సన్మానించారు.

కసాపురం ఆలయం శుభ్రం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు17: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కసాపురం నెట్టికంటి ఆలయాన్ని అధికారులు శుభ్రం చేశారు. ఆలయంలోని టెంకాయల కొట్టే ప్రాంతం, ప్రాకార మండపాలు, ముఖమండపం, అద్దాల మండపాన్ని నీటితో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ భద్రాజీ, అధికారులు, హనుమాన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, సెప్టెంబరు 17: మండలంలోని బొందలన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులుపై మంగళవారం అదే గ్రామానికి చెందిన నాగేంద్ర, రామ్మోహన్, బాలసుబ్బయ్యతో పాటు మరికొంతమంది కట్టెలతో దాడిచేసి గాయపరిచారని రూరల్ పోలీసులు తెలిపారు. రామాంజనేయులు, నాగేంద్రల మధ్య పాతకక్షలు ఉండేవి. మంగళవారం ఇంటివద్ద ఒకరికొకరు ఎదురుపడడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో రామాంజనేయులు గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుడిపై..

పట్టణ సమీపంలోని తేరన్నపల్లి రహదారి వద్ద ఉన్న వేబ్రిడ్జిలో పనిచేస్తున్న కార్మికుడు మల్లికార్జునపై మంగళవారం విశ్వనాథరెడ్డితోపాటు మరికొంతమంది కలిసి దాడిచేశారని రూరల్ పోలీసులు తెలిపారు. పెద్దపప్పూరు మండలం సోమనపల్లికి చెందిన మల్లికార్జున గత కొంతకాలంగా వేబ్రిడ్జిలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాడిపత్రి మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి మరో వ్యక్తితో డబ్బుల విషయంలో గొడవపడుతుండగా మల్లికార్జున సర్దిచెప్పడానికి వెళ్లాడు. ఇదే సమయంలో విశ్వనాథరెడ్డి మల్లికార్జునపై కూడా దాడికి దిగడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విశ్వనాథరెడ్డిపై కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పెద్దవడుగూరు, సెప్టెంబరు 17: రైతులు తమ పంట పొలాల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులను సాధించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్తలు రమేష్, కిషోర్‌రెడ్డి సూచించారు. మండలకేంద్రంతో పాటు చిన్నవడుగూరు, దిమ్మగుడి గ్రామాల్లో మంగళవారం వారు పర్యటించి పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తిలో ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులు అధిగమించడానికి రైతులు లీటరు నీటిలో పొటాషియం నైట్రేట్ 5గ్రాములు, ఒక గ్రాము బోరాన్ కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. గులాబీ రంగు పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ అధికారి శైలజ, జిల్లా రైతు శిక్షణా కేంద్రం అధికారి శ్రీనివాసులు, పామిడి ఏఓ లీనా, విస్తరణ అధికారి ప్రసాద్, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

పామిడి, సెప్టెంబరు 17: మండలంలోని నీలూరు, ఎద్దులపల్లి గ్రామాల్లో పత్తి, జొన్న, కంది పంటలను వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పంటలకు తెగుళ్లు, పురుగుల బెడదను గుర్తించారు. వాటి నివారణకు చేపట్టాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ మద్దిలేటి, ఏఓ లీనావసుందర, ఆత్మ పీడీ డీఆర్‌సీ మద్దిలేటి, ఏడీఏ శైలజాకుమారి రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

యాడికి, సెప్టెంబరు 17: మండలంలోని పెండేకల్లు గ్రామానికి చెందిన సూర్యనారాయణరెడ్డి అనే వ్యక్తిపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. పెండేకల్లులో రస్తా విషయమై నారాయణస్వామి అనే వ్యక్తిని సూర్యనారాయణరెడ్డి కులం పేరుతో దూషించి దాడిచేసి గాయపరిచారన్నారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు సూర్యనారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఇదే సంఘటనలో తనపై నారాయణస్వామి, రామాంజనేయులు, సుబ్బమ్మలు దాడి చేసి గాయపరిచారని సూర్యనారాయణరెడ్డి ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

యాడికి, సెప్టెంబరు 17: మండలకేంద్రంలోని నెంబరు -3 ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉచిత కంటి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిపత్రి డివిజన్ జీపీఎంఓ మధుసూదన్‌రాజు మాట్లాడుతూ.. జాతీయ అంధత్వ నివారణలో భాగంగా కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్నల ఆదేశాల మేరకు 114మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 8మంది విద్యార్థులకు కంటిఅద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి త్వరలో ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామన్నారు. తర్వాత అవసరమైన విద్యార్థులకు కంటి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుశీలాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు కంటి వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 17: పట్టణంలోని అంజుమన్‌వీధిలో గల ఏపీ ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు రాముడు మంగళవారం ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు నంద్యాల శాంతిరాం హాస్పిటల్ వైద్యులు పరీక్షలు కంటి పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కణేకల్లు, సెప్టెంబరు 17: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో పలు అభివృద్ధి పనులను టీడీపీ నాయకులు మంగళవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధుల కింద మంజూరైన రూ. 15 లక్షల పనులకు సంబంధించి సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, బీటీ రమేష్, అనిల్, కురుబ నాగరాజు, నాగభూషణం, వెంకటేశులు, శేఖర్, గామేష్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 17: రైతులకు ఇబ్బంది కలగకుండా ఈ క్రాప్ బుకింగ్, ఈ కేవైసీకు ఎల్పీ నెంబర్ల సమస్య లేకుండా సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ మునివేలు తెలిపారు. మండలంలో ఎల్‌పీ నంబర్ల సమస్యల నేపథ్యంలో మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో రైతన్నకు తప్పని తిప్పలు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు తహసీల్దార్ స్పందించారు. రైతు సమస్యలను ఎప్పటికపుడు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కేవైసీ, క్రాప్ బుకింగ్‌లో ఏదైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పంట నమోదుకు డబ్బు అడుగుతున్నారా..?

● రైతులను ఆరా తీసిన జాయింట్ కలెక్టర్ ● నిట్టూరులో ముఖాముఖి



రైతు ఈకేవైసీని స్వయంగా చేస్తున్న జేసీ

యాడికి, సెప్టెంబరు 17: పంట నమోదుకు వ్యవసాయశాఖ సిబ్బంది ఎవరైనా మిమ్మల్ని డబ్బులు అడుగుతున్నారా..... మీరు సాగుచేసిన పంటనే నమోదు చేస్తున్నారా అంటూ నిట్టూరు గ్రామంలో రైతు సేవా కేంద్రంలో పలువురు రైతులను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఆరాతీశారు. మండలంలోని నిట్టూరు రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీచేశారు. రైతుల ఈ-కేవైసీ జరుగుతుండడాన్ని పరిశీలించి రైతు నాగిరెడ్డికి సంబంధించిన ఈ-కేవైసీని స్వయంగా జాయింట్ కలెక్టరే చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌కు రైతు నాగిరెడ్డికి మధ్య సంభాషణ ఇలా కొనసాగింది.

జేసీ: ఏం పెద్దాయన వేలిముద్రలు ఎందుకు వేస్తున్నావు?

రైతు నాగిరెడ్డి: పంట నమోదుకు సార్.

జేసీ: పంట నమోదుకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా?

రైతు : ఎవరూ అడగలేదు సార్.

జేసీ: ఎన్ని ఎకరాల్లో పంట వేశావు.

రైతు: 2.12ఎకరాల్లో పత్తి పంట వేశాను సార్.

జేసీ: మీరు సాగుచేసిన పంటనే నమోదు చేస్తున్నారా, వేరే పంటను నమోదు చేయించుకుంటున్నారా

రైతు: మేము ఏ పంట వేసింటే అదే నమోదు చేస్తున్నారు సార్..

జేసీ: వేలిముద్రలు ఎవరడిగినా వేస్తారా ?

రైతు: వేస్తాము సార్.

జేసీ: అలా వేయకండి, గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అడిగితే మీరు వేలిముద్రలు వేస్తే మీ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు దోచేస్తారు. జాగ్రత్తగా ఉండాలి.

రైతు: ఆఫీసర్లను అందరిని చూశాం కదా సార్.. వారు వచ్చి అడిగితేనే వేస్తాం సార్.

ఈ క్రాప్ బుకింగ్, రైతుల ఈకేవైసీ వేగవంతంగా పూర్తిచేయాలని వ్యవసాయశాఖ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

అరటి మొక్కల నరికివేత



అరటిమొక్కలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్లూరు, సెప్టెంబరు 17: మండలంలోని కుమ్మనమల గ్రామంలో ఓబుళకొండయ్య, శ్రీనివాసులుకు చెందిన అరటిమొక్కలను మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారని ఎస్ఐ హేమాద్రి తెలిపారు. ఓబుళకొండయ్య, శ్రీనివాసులు అన్నదమ్ములు. ఇద్దరు సుమారు ఆరు ఎకరాల్లో అరటిపంటను సాగు చేశారు. కాగా సోమవారం రాత్రి ఇద్దరి తోటల్లోని 150 అరటి మొక్కలను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. మధ్యాహ్న సమయంలో తోటకు వెళ్లిన ఆ ఇరువురు నరికివేతకు గురైన మొక్కలను చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేయించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పీఎం ఆవాస్ యోజన గృహాలు ప్రారంభం



గృహాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పుట్లూరు, సెప్టెంబరు 17: మండలంలోని మడుగుపల్లిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద 2021-22వ ఏడాదిలో మంజూరైన గృహాలను అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషారెడ్డి ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహాలను ప్రారంభించామన్నారు. నిర్మాణం పూర్తిచేసిన ముగ్గురు లబ్ధిదారులకు ఇంటిపత్రాలను అందించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమన్నారాయణ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, హౌసింగ్ ఏఈ లోకేష్, టీడీపీ నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు



గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, బీజేపీ నాయకులు

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 17: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పట్టణంలోని అరక్షిత శిశు మందిరంలో మంగళవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి, బీజేపీ నాయకులు హాజరై కేక్ కట్ చేశారు. చిన్నారులకు అన్నదానం చేపట్టారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బండారుకృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు వడ్డెరమేష్, జనసేన నాయకుడు పూలరమణ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను పట్టణంలోని బీజేపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింక వసుంధర, అసెంబ్లీ కన్వీనర్ హీరోజీరావు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. పట్టణ కార్యదర్శి ప్రకాష్, నాయకులు శివ పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ జాతర

బొమ్మనహాళ్, సెప్టెంబరు 17: మండలంలోని ఉప్పరహాళ్ క్రాస్‌లో మారెమ్మదేవి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్దఎత్తున బోనాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తెచ్చారు. అక్కడ అమ్మవారిని గంగాజలంతో అభిషేకించి పుష్పాలంకరణ చేసి బోనాలను సమర్పించి మహామంగళహారతి ఇచ్చారు. అలాగే జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఐదేళ్లకొకసారి భాద్రపద మాసంలో అమ్మవారి జాతర చేయడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు.

రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి: జేసీ

తాడిపత్రి, సెప్టెంబరు17: పౌరసరఫరాల గోదాముకు సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరిగా ఉండాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. పట్టణ సమీపంలో ఉన్న పౌరసరఫరాల గోదామును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ ఉండాలన్నారు. స్టాక్ పరిమాణం, గోదాములో నిల్వ ఉన్న పరిమాణం రెండు ఒకేవిధంగా ఉండాలన్నారు. సరుకు రవాణా చేసే సమయంలో జరిగే వృథాను అరికట్టాలని సూచించారు. గోదాము నుంచి ఎఫ్‌పీ షాపులకు సరుకులను నిర్ణీత సమయంలో సరఫరా చేయాలని తెలిపారు. ఆయన వెంట పౌరసరఫరాలశాఖ మేనేజర్ రమేష్‌రెడ్డి, తహసీల్దార్ బాలాజీ, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

యాడికి: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రికార్డుల గదిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోవాలి

బెళుగుప్ప, సెప్టెంబరు 17 : బెళుగుప్ప-2 రేషన్ దుకాణం డీలర్ అర్హులైన లబ్ధిదారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయడం లేదని, విచారించి చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య, మల్లికార్జున మంగళవారం స్థానిక తహసీల్దార్ షర్మిలకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రేషన్ షాపు వైసీపీ నాయకుడి ఆధీనంలో నడుస్తోందన్నారు. అక్కడ పెద్దఎత్తున అవకతవకలకు చోటు చేసుకుంటున్నాయన్నారు. గ్రామంలో లేని వారి, చనిపోయిన వారి కార్డులపై కూడా డీలర్ సరుకులు పంపిణీ చేసినట్లు రికార్డులలో నమోదు చేసి కాజేస్తున్నారని తెలిపారు. సుమారు 50 నుంచి 70 కార్డులకు అందాల్సిన బియ్యం బొక్కేశారన్నారు. దీంతో పాటు అంత్యోదయ కార్డు లబ్ధిదారులకు 35 కిలోలకు గాను కేవలం పది కిలోలు మాత్రమే ఇచ్చారన్నారు. పూర్తిస్థాయిలో విచారించి కాజేసిన నిత్యవసర సరుకులు రికవరీ చేయాలని కోరారు. నాయకుల ఎదుట సిబ్బందిని విచారించగా వైసీపీ నాయకులు చెప్పడంతో లాగిన్‌కు వేలిముద్ర వేసినట్లు ఒప్పుకున్నారు. స్పందించిన తహసీల్దార్ విచారణకు ఆదేశించారు. అవకతవకలు జరిగినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయంలో ప్రధాన అధికారి పాత్ర ఉన్నట్లు విమర్శలు వస్తున్నాయి.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

తాడిపత్రి, సెప్టెంబరు 17: పట్టణంలోని వరహాలు తోట సమీపంలో రెండురోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాధిక్ (16) అనంతపురంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని రూరల్ పోలీసులు తెలిపారు. పట్టణంలోని క్రిష్ణాపురం 7వరోడ్డులో నివాసం ఉంటున్న రాజకుళ్లాయప్ప, నబియా దంపతుల కుమారుడు సాధిక్ స్థానిక ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కాగా రెండురోజుల క్రితం మిత్రులు లోకేష్, ఫయాజ్‌లతో కలిసి బైక్‌లో హాజీవలి దర్గాకు బయలుదేరాడు. వరహాలు తోట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వీరిలో సాధిక్ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.